# పచ్చ తిరుగుబాటు

టి. సంపత్ కుమార్

"మనుషులేంటీ ... ఇలా మారి పోతున్నారూ ?..." అంది చిరాగ్గా మల్లె.

"అవును సుమీ, నేనూ గమనిస్తూనే ఉన్నాను... చాలా మార్పొచ్చింది ఈ మనుషుల్లో ...." గులాబి అసహనంగా అంది.

"ఇలా ఎవరికి వారు తమ తమ అభిప్రాయల్ని వెలిబుచ్చుకుంటే సరిపోదు ... మనం సంఘటితం కావాలి .. చర్చలు జరుపుకోవాలి .. అపుడే మన అభిప్రాయాలకు ఓ రూపం వచ్చేది." గాలికి ఊగుతున్న తులసి కాస్త కోపంగానే అంది.

"అవునవును. చర్చలు జరుపుకొని మనమో కార్యక్రమాన్ని రూపొందించాలి. ఈ మనుషులేమో ప్రపంచమంతటా మీటింగులు, సదస్సులు, వర్క్‌షాప్‌లు, శిఖరాగ్ర సమావేశాలంటూ దేశ దేశాల్లో, అంతర్జాతీయ స్థాయిల్లో చెట్టూ చేమలపై సుదీర్ఘ చర్చలు జరుపుతుంటారు." పక్కనే నీటిగుంటలో ఉన్న తామర కొంచెం వివరించింది.

"మీ చర్చల్లో మేమూ పాల్గొంటాం." ఉత్సాహంతో నాచు.

"మీ మాటలు వింటుంటె నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ మాటల్ని ఊరకే పోనీయకండి. చర్చలు ఎప్పుడో నిర్ణయించి తెలుపండి. మాతోటి వారందరికి తెలుపుతాను. వారూ పాల్గొంటారు. "దట్టంగా పెరిగిపోయిన బ్రహ్మజెముడు చైతన్యంతో.

"ఏంటి?"అందరూ ఏదో ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు." తియ్యగా పలికే వెదురు.

టేకు చెట్టు వివరించింది. యూకలిప్టస్ మరికొంత జోడించి తెలిపింది. ఈ సంభాషణల్ని వింటుంటె గాలికి ఊపు వచ్చింది. మల్లెతో మొదలైన సంభాషణ చెట్టు చెట్టుకు చేరింది. కాశ్మీర్‌లోని చినార్ 'సై' అంది. హిమాచల్‌లోని యాపిల్ చెట్టు పండ్లు రాలేంతవరకు సంతోషంతో ఊగింది. పంజాబ్‌లోని గోధుమ పులకించింది. రాజస్థాన్ లోని ఖర్జీచెట్టు భారీవర్షంలో తడిసినంత సంతోషించింది. గుజరాత్ గిర్ అడవిలోని చెట్టుకు పుట్టకు తెలిసిపోయింది. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బీహార్ అడవుల్లో కొత్త శక్తి నిండింది. కర్ణాటక చందనం మరింత గాఢమైన వాసనను వెదజల్లింది. కేరళా కొబ్బరి చెట్లు చప్పట్లు కొట్టాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని హరితం ఉరకలు వేసింది.

చెట్ల సంభాషణల్ని, వాటిలో పేరు కుంటున్న నూతనోత్సాహాన్ని పరికిస్తున్న గాలి అన్ని విధాల తోడ్పడుతానంది. రయ్ మంటూ రాష్ట్రాల్ని దాటింది! సందేశాన్ని మోస్తూ దేశ సరిహద్దుల్నీ దాటింది !!

★ ★ ★

"ఈనాటి చర్చల్లో అందరూ సమానం. ఏక కణజీవులైన శైవలాల నుండి నాలాంటి మహావృక్షమైన మర్రి చెట్టు వరకూ ప్రముఖమైనవే! ఆవరణ వ్యవస్థల్లో అందరికీ పాత్ర ఉంది కదా!" అని మొదటి వక్తగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది వంద సంవత్సరాలు నిండిన మర్రిచెట్టు.

"ఆఁ. అన్నట్టు మరిచాను. మానవుని కండ కావరపు చర్యల వల్ల ఎన్నో మొక్కల జాతులు, ప్రజాతులు ఈరోజు మన మధ్యలేవు. మనమిక వాటిని చూడం. అంతరించాయి. రాతల్లో మిగిలిపోయిన మన మిత్రుల్ని ఓసారి తలచుకోవడం ధర్మం. అవి మానవజాతికి చేసిన సేవను స్మరించుకొని రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం !" భారంగా, ఆర్ద్రతతో మర్రి.

"మర్రి చెట్టు సూచనతో ఏకీభవిస్తాను. నాదో సలహా. మన చర్చలు కోకొల్లలుగా జరిగే మనుషుల మీటింగుల్లా కాకుండా సాయంత్రం వరకు మనం ఓ ఆచరణ యోగ్యమైన ప్రణాళికను సిద్ధం చేయాలి. ఇక్కడున్న వారందరికి మరో విజ్ఞప్తి, ఏదోమాట్లాడాలని కాకుండా, సాగుతున్న చర్చల్ని దృష్టిలో ఉంచుకొని అవసరమనిపిస్తేనే మాట్లాడండి. సమయం చాలా విలువైనది." అంది ఎన్నో మనుషుల మీటింగుల్ని, కాన్ఫరెన్సుల్ని పరిశీలించిన ఓ అలంకరణ మొక్క.

చెట్లన్నీ మౌనం పాటించాయి. ప్రతి చెట్టు మనస్సులో మనిషి రూపం మరింత క్రౌర్యాన్ని సంతరించుకున్నట్టు, తమను కూడ ఓ రోజు ఈ పృథ్వినుండి తరలిస్తారేమోనన్న భయంకరమైన ఆలోచనలు ముసిరాయి.

"మన స్థితిగతుల గురించి ఓసారి అవలోకనం చేసుకుంటే మంచిది. రోజు రోజుకూ జనాభా తగ్గుతుంది. ఎన్నో మొక్కలు మన మధ్య ఈనాడు లేవు. ఈమనుష్యులు చాలా అన్యాయంగా తయారయ్యారు. తమకు అవసరమనిపించే కొన్ని మొక్కలపై విశేష ధ్యానాన్ని, అభిరుచిని చూపుతున్నారు. వాటికే పెద్ద పీట వేస్తున్నారు. ప్రాముఖ్యత నిచ్చి ప్రాణప్రదంగా పెంచుతున్నారు. కావలసిన రీతిలో మలచుకుంటున్నారు. రంగులు మార్చారు. ఆకారాలు మార్చారు. రుచులనూ మార్చారు. స్వరూప స్వభావాల్నే మార్చేసి ఆటల్ని నేర్పిన కోతిలా మనల్ని వాడుకుంటున్నారు. ఒక్కోసారి మన జీవితం మనకే వెగటని పిస్తుంది! నేను నేనేనా అన్న అనుమానం వస్తోంది." అంది ఆవేదనతో ఎన్నోసార్లు సంకరణ ప్రయోగాలకు గురైన టొమాటో మొక్క.

"నాదీ అంతే! నాశరీర ధర్మాన్ని స్వభావికంగా నిర్వర్తించనివ్వరు. ఏవో 'జీన్స్' ను చొప్పించి తొందరగా కాపుకు తెప్పిస్తారు. మోయలేని కాత కాయించుకుంటారు. నా శరీరంపై ఆ 'జీన్స్' ఎలాటి ప్రభావం చూపుతుందో అర్థం చేసుకునే స్థితిలో ఉన్నారంటారా ఈ మనుషులు? అదే వారి విషయం ఆలోచించండి. ఆలస్యంగా పెళ్ళి చేసుకొమ్మని బోధిస్తారు. పిల్లల్ని వెంటనే కనొద్దని ప్రచారం చేస్తారు. ఒకరిద్దరు చాలని గొంతెత్తి అరుస్తారు. తల్లులేమో తమ పిల్లలకే పాలిచ్చేందుకు సందేహిస్తారు. పశువులనేమో ఎక్కువ పాలిచ్చేందుకు ప్రయోగాలకు గురిచేస్తారు.. హార్మోన్లనెక్కిస్తారు..." ఆవేశంగా

తమాయించుకుంటూ అంది కొబ్బరి చెట్టు.

"ఇపుడిపుడే మనుషుల ఆలోచనల్లో మెల్లగా మార్పొస్తోంది. ముఖ్యంగా మనలో ఉన్న వైవిధ్యాన్ని గమనిస్తున్నారు. గుర్తిస్తున్నారు. పర్యావరణ సంరక్షణలో మనల్ని ప్రముఖ పాత్ర ధారులుగా గౌరవించడం నేర్చు కుంటున్నారు. జీవరాశుల్లో వైవిధ్యాన్ని వారి మనుగడ కోసం కొనసాగించు కోవాలంటు న్నారు. మట్టి, నీటి వనరుల సంరక్షణలో మన పనితనాన్ని, మన ఉనికిని బాగా ప్రచారం చేస్తున్నారు..." అభయారణ్యంలో సురక్షితంగా చూసుకో బడుతున్నటేకు చెట్టంది.

"అవునవును .. అంతేకాదు .. కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత పెరిగి భూమిపై ఉష్ణోగ్రత పెరిగిపోతుందట. దీన్ని తగ్గించడానికి ప్రస్తుతం మనం చాలా అనుకూలంగా ఉన్నామట. మన జనాభాను బాగా పోషిస్తే కార్బన్-డై-ఆక్సైడ్‌ను కిరణ జన్యసంయోగక్రియకు ఉపయోగించు కుంటాం కదా! మన కూ మంచిరోజు లొచ్చాయ్ ...'సంబరపడుతూ అంది పరిశ్రమల ప్రాంతాల్లో పెరుగుతున్న నీలగిరి చెట్టు.

"మరీ అంతగా సంతోషపడకు .. చేసిన తప్పుల్ని దిద్దుకోడానికి మనల్ని బలి చేస్తున్నారీ మనుషులు. అసలు కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత పరిసరాల్లో ఎందుకు పెరిగింది ? మనల్ని నరికేస్తున్నారు. అడవులు తగ్గాయి. చెట్ల సాంద్రతా తగ్గింది. పరిశ్రమలు పెరిగాయి. మానవచర్యలు విచ్చల విడిగా పెరుగు తున్నాయి. కాలుష్యంతో భూమండలమంతా నింపేస్తున్నారు. వీరు చేసిన ఘాతుక చర్యలకు నిదర్శనాలయిన కలుషితాలను మనం చక్కగా పీల్చుకుంటామని, తెచ్చి పెట్టుకున్న మమకారంతోనే మనల్ని పెంచుతున్నారు. నావైపు ఇలా చూడు .. నేను థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ప్రాంతంలో ఉన్నాను. పరిశీలించి చూడండి నన్నోసారి. ఆకులపై మచ్చల్ని చూడండి. తక్కువ మోతాదుల్లో రోజూ కొంత విషాన్ని పీల్చుకుంటున్నాను. ఆరోగ్యంగా పూలను పూయలేకపోతున్నాను. కాసిన కాయలు పిందెల్లా బక్క చిక్కి ఉంటున్నాయి. మన జీవితాల్ని కాలరాస్తున్నారు..." అంగ వికలులను కన్న తల్లిలా దుఃఖాన్ని ఆపుకుంటూ అంది ఓ పెద్ద ఆకుల చెట్టు.

చెట్ల 'గుండెలు' బరువెక్కాయి. నిజంగానే ఆ చెట్టు శరీరమంతా చిలుము రంగులో మచ్చలున్నాయి. పూలలో జీవంలేదు. కాయల్లో మెరుపు లేదు.



"మానవులకు తగిన పాఠం నేర్పాలి. కాలుష్యమెక్కువైతే వాళ్లేమో మాస్కుల్ని ధరించి గాలిపీలుస్తారు. 'మంచి' నీటికైనా వడపోత తప్పదు. ఏమాత్రం అసౌకర్యం కలిగినా సమ్మెలంటూ, లాకౌట్లంటూ ఆమరణ దీక్ష లంటూ నిరవధికంగా కొనసాగిస్తుంటారు. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలనే గజ గజలాడిస్తారు. మనమూ మన తడాఖా చూపించాలి." అంది రోడ్డు పక్కన పెరిగి పోయిన చింతచెట్టు. ఎన్నో నినాదాలను విన్నదా చెట్టు ! "నీవన్నది పూర్తిగా అర్థం కాలేదు. కాస్త వివరించు." జోక్యం చేసుకుంటూ అరటి చెట్టు.

"మనుషుల్లా మనం కొన్ని రోజులు నిరాహారదీక్ష చేపడుదాం. అంటె కార్బన్-డై-ఆక్సైడ్‌ను మనం గ్రహించకూడదు. వంతుల వారిగా కిరణజన్య సంయోగక్రియను నిలిపేద్దాం. అంతే! కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత పెరిగిపోతుంది. ఇప్పటికే కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత పెరిగిందని ప్రజలు గాభరా పడు తున్నారు. ఇదే మంచి సమయం, మన ప్రతాపం చూపడానికి. ఉష్ణోగ్రత పెరుగుతుంది. ధ్రువాలు కరుగుతాయి. సముద్ర మట్టం పెరుగుతుంది. సైంటిస్టులకు సైతం అంతుచిక్కని రీతిలో ప్రకృతిబీభత్సాలను ఒక్కదెబ్బతో సృష్టించవచ్చు. అప్పుడు కాని ఈ మనుషులకు బుద్ధిరాదు." ఉక్రోషంతో, ప్రతీకారం తీసుకునే ధోరణిలో చింతచెట్టు.

"జాను ... జానౌను... అంతే... అంతే.. ఒకసారి మన తడాఖా ఏంటో తెలుపాలి ఈ మానవులకు." గట్టిగా కొన్ని చెట్లు ముక్త కంఠంతో.

నిశ్శబ్దం ... కాసేపటివరకు ఏచెట్టూ పలకలేదు. గంభీర వాతావరణం. ఉత్కంఠ.. ఏ చెట్టు ఎప్పుడు ఏం మాట్లాడుతుందో అని ఎదిరిచూస్తున్న స్థితి. చిరుగాలికి ఆకులు గలగల కదులుతుండగా రావి చెట్టు గొంతు సవరించుకొని "ఇప్పటి వరకు మీ అందరి అభిప్రాయల్ని జాగ్రత్తగా విన్నాను. నా మాటలు విని మీరు నన్ను మనుషులు పూజిస్తారనో, పవిత్రంగా చూసుకుంటారనో, అందుకే మనుషుల పక్షాన మాట్లాడుతున్నానని మాత్రం అనుకోకండి సుమా! నా దృష్టిలో మనమంతా నిరాహారదీక్ష పూనుకొని మానవాళిని మన కోపతాపాలకు, ప్రకృతి బీభత్సాలకు గురి చేయడం సబబు కాదు. సూచనాప్రాయంగా మెత్తగా హెచ్చరిస్తూ చేసే ఏపనినైనా నేను ఒప్పుకుంటాను, సమర్థిస్తాను కూడ. అలాటి మార్గంలో తీనుకునే ఏ నిర్ణయాన్నైనా సముచితమైనదిగా భావిస్తాను. హర్షిస్తాను." రిటైర్డు సైంటిస్టు ధోరణిలో రావి చెట్టు తన అభిప్రాయాల్ని తెలిపింది.

చెట్లన్ని ఆలోచనల్లో పడ్డాయి. దీర్ఘంగా ఆలోచించాయి. మెలికలు తిరిగిపోతున్న పారిజాతం గొంతు సవరించుకొని "నిరసనను తెలియజేయడానికి నేను నా సువాసనను ఇకనుండి వెదజల్లను. ఇది నా నిర్ణయం. "రావి సూచనకు శ్రీకారం చుట్టింది పారిజాతం.

వరి, గోధుమ, మొక్కజొన్న మొక్కలు గుసగుసలాడాయి. తమలో తాము మంతనాలు జరిపాయి. పెత్తనం వహిస్తూ వరి అంది "మేము పుప్పొడి రేణువులను వదలగూడదని నిర్ణయించుకున్నాం. అధిక దిగుబడి వంగడాలంటూ మమల్ని మరుగుజుల్ని చేస్తున్నారు. మోయలేనంత బరువుతో గింజల్ని

మోపిస్తున్నారు. పరాగ సంపర్కానికి సంకెళ్ళు వేస్తాం ! ప్రపంచమంతా ఆహారపు కొరత ఏర్పడుతుంది. భలే ! భలే !! ......"

"ఇక్కడి కొచ్చింది మన మన ప్రత్యేకతల్ని, గొప్పతనాల్ని చెప్పుకోడానికి కాదు. మొదటే మనమనుకొన్నాం, ఏకకణజీవుల నుండి మహావృక్షాల వరకు అందరూ సమానమేనని. మనుషుల్లేకుండా మనం బతగ్గలం. మనకు కావల్సిందేంటి ? సూర్యరశ్మి, గాలి, నీరు ఆధారం ... ఇవన్ని లభ్యమయ్యేంతవరకు మనం హాయిగా జీవించగలం.కాని మనం లేకుండా మనుషులకు మనుగడ లేదు ! ఎన్నో యుగాల నుండి కొనసాగుతుందీ చెట్ల - మనుషుల బంధం. రోజూ చెట్లను పూజించే వారున్నారు. చెట్లను కాపాడడంలో బలైపోయిన మనుషులున్నారు. నిజం చెప్పాలంటే సమస్యలు మొదలయ్యింది, ఉధృతమయ్యిందీ ఈ శతాబ్దంలోనే ! చరిత్రను మారుస్తున్న శతాబ్దమిది !! మానవుని సంకుచిత స్వభావం పరకాష్ఠకు చేరుకుందని నమోదు చేసిన శతాబ్దం !!! ప్రకృతినే పట్టులోకి తెచ్చేందుకు పరుగెడుత్తున్న శతాబ్దం ! వేల సంవత్సరాలవసరమయ్యే ప్రకృతి పరిణామాన్ని మహావేగంగా దౌడుతీయిస్తున్న ఇరవయ్యవ శతాబ్దం !!! అందువల్ల ఈ మనుషులకు ఓయాభై సంవత్సరాల గడువిద్దాం. ఈ సమయాన్ని తమ తప్పుల్ని సరిదిద్దుకునేందుకు ఏ విధంగా ఉపయోగించుకుంటారో ఓవారి 'మానవత'కు వదిలేద్దాం. అంతవరకు వారి చర్యలన్ని మనకు హానికరమయినా, ఇష్టం లేకపోయినా భరిద్దాం. అందులోనే మన మంచితనం, ఉదారత కనబడుతుంది. బాపులా బంగాళాదుంప మొక్క తనకున్న ప్రపంచానుభవంతో శాంతంగా పలికింది. వెంటనే వేప చెట్టందుకొని "బంగాళాదుంప ఉదారత ప్రస్తుత పరిస్థితుల్లో ఇమడదు. ఇది మానవాళి తమకుతామే వీపు చరచుకుంటున్న ఎలక్ట్రానిక్ యుగం. ఘడియ ఘడియకో మార్పు ! క్షణక్షణానికి ప్రగతి !! యాభై సంవత్సరాల్లో మనం ఏ స్థితికి చేరుకుంటామో, అసలు ఉంటామో ఊడతామో ? ఒక వేళ ఉన్నా మన రూపు రేఖలు ఏ విధంగా రూపాంతరం చెందుతాయో తెలియని ఆందోళన పూరిత జగత్తు. అందువల్ల మన సంవేదనను, విచారాన్ని స్పష్టమైన రూపంలో మానవాళికి చేరాలి. అపుడే వారిలో ఏమైనా మార్పును ఆశించవచ్చు ..." కొనసాగించింది వేపచెట్టు.

"గాంధీ పుట్టిన ఈ భూమిపై నిరాహార దీక్షను మించిన ఆయుధం లేదు. దానికి జయమేకాని ఓటమి తెలియదు. అది బాపూజీ అందించిన మహత్తర అస్త్రం. అందువల్ల నేను చింతచెట్టు ప్రతిపాదనను అంగీకరిస్తాను. మనం కిరణజన్య సంయోగక్రియ ద్వారా మన తిండి పదార్థాలైన కార్బోహైడ్రేట్‌లను తయారు చేసుకోవడం ఆపేద్దాం. కార్బన్-డై-ఆక్సైడ్‌ను మన శరీరంలోకి తీసుకోవడాన్ని ఆపుదాం. ప్రస్తుతమున్న తరం తనను తానేకాక మానవజాతిని కాపాడుకునేందుకు తాపత్రయ పడుతుందేమో చూడాలి. ఎందుకో నాకా నమ్మకం ఇంకా ఈ మానవాళిపై ఉంది. ఏమైనా సరే, కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు తగిన విషయ పరిస్థితిని, వారి క్షేమాన్ని కోరి, కల్పించక తప్పదు. నా ఈ ప్రస్తావనను పరిశీలించి వెంటనే మనం నిరాహారదీక్షను ప్రకటిద్దాం" పిలుపు ఇచ్చే నాయకుడి రీతిలో అరచింది వేపచెట్టు.

★ ★ ★

డా॥ రజని గత పదేళ్ళుగా మొక్కలతో 'మాట్లాడే' విషయంపై అంకితభావంతో పరిశోధన చేస్తోంది. తాను పనిచేసే సంస్థలో ఎక్కువ మందికి ఆ రిసెర్చి టాపిక్ అర్థం కాదు. అర్థమయ్యినా పరిశోధనా ఫలితాలు సమాజానికి ఎంతవరకు ఏ విధంగా ఉపయోగపడతాయోనని హాస్యం చేస్తుంటారు. అనుమానపడుతుంటారు. అయితే డా॥ రజనికి తన పనిపై తనకు అపారమైన నమ్మకం. ఆ ఆశాభావమే సంతృప్తికరమైన ఫలితాలను ఇస్తూ ముందుకు తీసుకెళ్తుంది. డా॥ రజని ప్రయోగశాల చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. రకరకాల మొక్కలు. మొక్కల్ని కంప్యూటర్లను కలుపుతూ కేబుల్స్, కంట్రోల్స్, మానిటర్స్. ఇంకా ఎన్నో రకాల ఉపకరణాలు. ఓవైపు ప్రింటర్‌పై డాటా నిరంతరంగా ప్రింటవుతుంటోంది. మరోవైపు గోడపై బిగించిన స్క్రీన్స్ వచ్చిపోయే సిగ్నల్స్. క్రితం సంవత్సరమే డా॥రజని తాను ప్రయోగానికుపయోగించిన మొక్కల 'అంతరంగాన్ని' తెలుసుకోగలిగింది. మొక్కలతో కాస్సేపు 'మాట్లాడ' గలిగింది. ఆరోజు డా॥ రజనికి యురేకా రోజు. క్రమంగా ప్రపంచానికి తన పరిశోధన, తాను సాధించిన అద్భుత విజయం గురించి తెలిసిపోయింది. నిరాడంబరంగా ఉండే రజని తన పరిశోధనను టార్చ్‌లైట్‌తో పోలుస్తుంది. టార్చ్‌లైట్ వేసిచూస్తే మూడు ప్రదేశాలు కనబడతాయి. బల్బ్‌నుండి కొంత దూరం వరకు వెలుతురు స్పష్టంగా ఉంటుంది. తరువాతది మసక వెలుతురు చీకట్ల మిశ్రమం. ఆ తరువాత చీకటి. టార్చ్‌లో బ్యాటరీలు ఎక్కువైనా కొద్ది స్పష్టమైన వెలుతురు సాగుతుంది. మిగతా రెండు ప్రదేశాలు - మసక, చీకట్లు ఎప్పుడూ అంటుకునే ఉంటాయి. తన పరిశోధనా ఫలితాలను బ్యాటరీలుగా, వాటి సంఖ్య ఎంత పెరిగినా వెలుతురు ఎంతో ముందుకు ప్రయాణించినా మసక-చీకటి ప్రదేశాలు ఎప్పటికీ ఉంటాయంటూ రిసర్చి అనంతమైందని తన్మయత్వంతో చెబు తుంటోంది. తన ఫలితాలు అంతర్జాతీయ పత్రికైన 'నేచురల్ సైన్స్'లో వచ్చాయి. భారత ప్రభుత్వం డా॥ రజనికి యంగ్ సైంటిస్ట్ బిరుదును ఇచ్చింది.

రాత్రి పదిగంటల సమయం. డా॥రజని ఇంటికెళ్ళడానికి సంసిద్ధమవుతుంది. ప్రయోగశాల మూసేసేముందు ఒక్కసారి స్క్రీన్ వైపు దృష్టిమరలింది. సిగ్నల్స్ లయ తప్పి వస్తున్నాయి. ఏదో ప్రత్యేకత. అసాధారణంగా కనబడ్డాయి. ఆరాత్రంతా స్క్రీన్ పై వస్తున్న సిగ్నల్స్‌ను పరిశీలిస్తూ కూర్చుంది డా॥ రజని.

★ ★ ★

ప్రపంచమంతా అశాంతి రాజుకొంటోంది. అలజడిగా ఉంది. అంతు తెలియకుండా ఉంది. భూమిపై బాహ్య ఉష్ణోగ్రత మెల్లగా .. క్రమేణా పెరుగుతోంది. ధ్రువాలు మెల్లమెల్లగా కరగడమారంభించాయి. సముద్ర మట్టం పెరిగి తీర ప్రాంతాలు స్థానభ్రంశం చెందుతున్నాయి. ప్రజా జీవనం అస్తవ్యస్త మవుతుంది. శాస్త్రజ్ఞులు

తమ విజ్ఞాన భాండాగారాన్ని, అనుభవాల్ని, ఆధునిక సాంకేతిక జ్ఞానంతో జోడించి ప్రతిపాదనలను, సిద్ధాంతాలను రూపొంది స్తున్నారు. ప్రపంచంలోని పలుచోట్ల గాలి సాంపిల్స్ తీసుకొని విశ్లేషించారు. ఉష్ణోగ్రత పెరగడానికి కారణం కార్బన్-డై-ఆక్సైడ్ అని నిర్ధారించారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత ఎలా పెరుగుతుందో అన్న విషయానికి మూల కారణం మాత్రం ఎంతకూ తేలడం లేదు. బహుళ రాజ్యసమితి ఒక ఉచ్ఛస్థాయి కమిటీని నియమించింది. అదుపులోకి తేవడానికి కార్బన్-డై-ఆక్సైడ్ వదిలే ఫ్యాక్టరీలను, వాహనాలను మొదలగు వాటిని నియంత్రణలోకి తెచ్చారు. కొన్ని రోజులు ఆపిచూసారు. అయినా మూల కారణం సవాలుగానే నిల్చింది. కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత చాపకింది నీరులా విస్తరిస్తూనే ఉంది. సామాన్య మానవునికి సైతం రాబోయే గండం అర్ధమవుతోంది. శాస్త్రజ్ఞులు మానవజాతి భూమిపై ఇంకా ఎన్ని రోజులుండగలదో, ఏవిధంగా త్వరలోనే అంతరించనున్నదో లెక్కించడం మొదలుపెట్టారు. ఓ పరిశోధనా బృందం అరవైరోజులంది. మరో బృందం మరో రకంగా లెక్కకట్టి మానవశరీరధర్మాన్ని గణనలోకి తీసుకొని నలభైతొమ్మిది రోజులంది. ఇలాగే పరిస్థితి కొనసాగితే పృథ్వినుండి మానవాళి అదృశ్యం కావడం మాత్రం ఖాయమని అధికార పూర్వకంగా ప్రకటించారు.

★ ★ ★

డా॥ రజని సమాచారాన్నంత పరిశీలించి విశ్లేషణను పూర్తి చేసింది. ఓ అభిప్రాయానికి వచ్చింది. కాగితాలను సిద్ధం చేసుకొని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ సెక్రటరీలను కలిసింది. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొన్ని గంటల్లో ప్రధానమంత్రి ఆధ్వర్యంలో అత్యయిక సమావేశం జరిగింది. బహుళ రాజ్య సమితికి భారత ప్రభుత్వం తన యోజనను పంపింది. మరునాటి దిన పత్రికల్లో ప్రధానశీర్షికలు 'పగబూనిన చెట్లు', 'కనురెప్పే కాటేస్తే', 'చెట్ల నిరాహార దీక్ష', 'భారతశాస్త్రవేత్త చెట్లతో బాతాఖానీ', 'చెట్లతో మీటింగుకు తరలివస్తున్న అగ్రనాయకులు'... అంటూ వచ్చాయి.

★ ★ ★

ఎండాకాలంలో ప్రజలు ప్రతిరోజూ ఉష్ణోగ్రతను గమనిస్తున్నట్లుగా దినపత్రికల్ని తెరవగానే కార్బన్-డై-ఆక్సైడ్ గాఢతను ఆసక్తితో చూస్తున్నారు. రేడియోల్లో, టీవీల్లో రోజూ ప్రత్యేక బుల్లెటిన్లు ప్రసారం చేస్తున్నారు. సామాన్యులు సైతం గాభరా పడుతున్నారు. అప్పట్లో స్కైలాబ్ పడే ప్రాంతాల్లో సృష్టించిన భయభీభత్సాలు ఇవుడు ప్రపంచమంతా వ్యాపించాయి. గంటలు - రోజుల గడిచినా కొద్దీ మృత్యువుకు దగ్గరవుతున్న ఆందోళన. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికి లోపల ఓ రకమైన గుబులు గూడుచేసుకున్నా, ఇది అందరి సమస్యకదా అంటూ నలుగురితో నారాయణలా ధైర్యాన్ని అరువు తెచ్చుకొంటున్నారు. సామూహికంగా వచ్చే ముప్పును కొందరు సరదాగా తీసుకుంటే మరికొందరు ఫిలాసాఫికల్‌గా తీసుకొంటున్నారు. ఆసక్తికరమైన చర్చలు జరిగేవి. అందరూ పోయాక మన ఊరు ఎలా ఉంటుందో ప్రపంచ ఏమవుతుందో అని తాము లేకుండా ఊహించుకొనేవారు. జోకులు వినురుకునేవారు. సరదాగా నవ్వుకునేవారు. వెంటనే సీరియస్‌గా మారి ధైర్యం తెచ్చుకునేవారు.

కక్షలు మానుకున్నారు. బ్రతికేది కొన్ని రోజులే అని అసూయ ద్వేషాలను వదిలారు. కోపతాపాలను విసర్జించారు. ప్రేమ పరిమళాలను వెదజల్లుతున్నారు. కొన్నే రోజులని సంతోషం కోసం విలాసంగా ఖర్చు పెడుతున్నారు. పెళ్ళిళ్ళ సంఖ్య ఒక్కసారే పెరిగిపోయింది. మతాల మధ్య సామరస్యం పెల్లుబికింది. ఒకరి ప్రార్థనా మందిరాల్లోకి మరొకరు సంతోషంతో వెళ్తున్నారు. సాధువులు, స్వాములు ప్రకృతిని శాంతింపజేయడానికి యజ్ఞాలు కూడ ఆరంభించారు. భార్యలు భర్తలు మరింత దగ్గరయ్యారు. విశాల దృక్పతపు పవనాలు వీస్తున్నాయి. మరోవైపు సదస్సులు, గోష్టులు జరుగుతున్నాయి. ఏ చర్చల్లోనయినా, ఏ కోణం నుండి చూసినా చివరకు 'మనిషి' దోషిగా స్పష్టంగా కనబడుతున్నాడు. అందరూ వాపోతున్నారు. ముందు జాగ్రత్తలతో తల్లిని కాపాడుకోలేక పోయామని కన్నీరు కారుస్తున్నారు. తమ అకతాయి తనాల్ని విమర్శించుకుంటున్నారు. "మనమంతా ఈ అద్భుతమైన ప్రపంచాన్ని అనుభవించాం. ఆనందించాం. మన పిల్లలు మనల్ని దోషులుగా నిలదీసి అడుగుతున్నారు. వారికేం సమాధానం చెబుతాం. మనకు సంతరించుకున్న వనరులనైనా అదేస్థాయిలో అందించ లేక పోతున్నాం. ఇప్పుడు తల్లుల కడుపుల్లో రూపం పోసుకొంటున్న శిశువులు మన వికారపు మొఖాలు చూడరు. చూడలేరు." అంటూ లబోదిబో మంటున్నారు. నున్నిత హృదయులు. తమను తామే శపించుకొంటున్నారు!

★ ★ ★

డా॥ రజని తన సరంజామాను అమర్చింది. అందులో రకరకాల ఉపకరణాలు, ఆధునిక కంప్యూటర్లున్నాయి. తానో కంప్యూటర్ ముందు కూర్చుంది. దూరాన కేబుల్స్ రకరకాల ఉపకరణాలనుండి కొనసాగుతూ విజ్ఞాన్ భవన్‌పై గాలిలోకి చిత్ర విచిత్రాకృతులలో నున్న ఆంటెనాల రూపంలో అంతమయ్యాయి. వేదికకు మరోవైపు పలుదేశాల అగ్రనాయకులు ఆసీనులై ఉన్నారు. వారి పక్కన సంప్రదింపుల కొరకు పర్యావరణ మంత్రులు, సెక్రటరీలు కూడ అందుబాటులో ఉన్నారు. అంతేకాక పర్యావరణ సంభందిత అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, బహుళరాజ్య సమితికి చెందిన ప్రతినిధులూ కూడ ఉన్నారు. అందరిలో ఉత్కంఠ ! ప్రకృతితో బేరి అది మరి !!

డా॥ రజని మాట్లాడానికి ఉపక్రమించింది.

"ఆనరబుల్ హెడ్స్ ఆఫ్ స్టేట్స్, రిప్రెజెంటేటివ్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ అండ్ అదర్ డిగ్నిటరీస్.

మానవాళి ఒక విచిత్ర సమస్యతో విషయవలయంలో చిక్కుకుంది. ప్రస్తుత పరిస్థితి ఇలానే కొనసాగితే ఏమౌతుందో అందరికి తెలుసు. మీరంతా మీ దేశాల్లో అధికార ప్రకటనలిచ్చారు. మూల కారణమైన కార్బన్-డై-ఆక్సైడ్ గాఢత క్రమేణా పెరగడం గురించి ఎవ్వరూ స్పష్టమైన వివరణను ఇంతవరకూ ఇవ్వలేక పోయారు. ఏవిధమైన విపత్తులు రానున్నవో తెలియదు. అయితే గత పదేళ్ళుగా,

'మొక్కలు - వాటి సమాచార వ్యవస్థ' అన్న అంశంపై పరిశోధిస్తున్న నాకు నాలుగురోజుల కిందటి రాత్రి ఒక ముఖ్యమైన రోజు. ఆరోజు నా ప్రయోగశాలలో వృక్షజాతి మానవాళిపై తిరుగుబాటు ప్రకటించిందని తెలిసింది. మనపై వాటికి విశ్వాసం పోయింది. మనం చేసిన పనులపట్ల అవి తమ ఆవేదనను తీవ్రరూపంలో ప్రదర్శిస్తున్నాయి. విశాలమైన ఈ పృథ్విలో మనం బుర్రలో పోషించుకుంటున్న సంకుచిత స్వభావాల్ని దీర్ఘంగా చర్చించాయి. మౌన ఋషుల్లా ఉంటాయనుకుంటున్న చెట్లు ఎంతో ఆలోచించి చివరకు ఏకగ్రీవంగా మనపై మెత్తని యుద్ధాన్ని ప్రకటించాయి. మన జీవనంలో పరిశ్రమల్లో, కార్మాగారాల్లో, కార్యాలయాల్లో తమ తమ కోర్కెలు నెరవేర్చుకోడానికి సమ్మెలు, నిరాహారదీక్షలు చేయడం మామూలే. సరిగ్గా అలానే వృక్ష సముదాయం మనపై ప్రకటించింది. తామూ 'ఆహారం' తీసుకోమ ంటున్నాయి. కిరణ జన్యసంయోగక్రియకు లాకౌట్ చేసాయి. అంటే కార్బన్-డై-ఆక్సైడ్‌ను తమలో స్థాపితం చేసి పిండిపదార్థాలను తయారుచేసే ప్రక్రియను తాత్కాలికంగా మానివేసాయి. ఇది ఏ ఒక్క దేశానికో, ఖండానికో పరిమితం చేయకుండా భూగోళస్థాయిలో తీసుకున్న నిర్ణయం కావున ప్రభావం అంతటా కనబడుతుంది.

నా పరిశోధనల ఫలితంగా నేను మొక్కలతో సమాచార వ్యవస్థను నెలకొల్పగలిగాను. మీరంతా ఇక్కడకు చేరే సరికే వృక్ష సముదాయం రావి వృక్షాన్ని తమ ప్రతినిధిగా ఎన్నుకున్నాయి. మానవాళితో చర్చలు జరిపేందుకు రావి చెట్టు సిద్ధంగా ఉంది. నేను మీకూ - రావి చెట్టుకూ సంధానకర్తగా వ్యవహరిస్తాను. మరో మనవి. వృక్ష సముదాయం మీనుండి భరోసాలను, వాగ్దానాలను ఆశించకుండా మీ నిర్ణయాలను స్పష్టంగా తెలుపమంటున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సముచితంగా మీ నిర్ణయాన్ని తెలిపితే నేను రావిచెట్టుకు మీ సమాచారాన్ని చేరవేయగలుగుతాను. మీ నిర్ణయాలు మానవాళి భవిష్యత్తును నిర్దేశిస్తాయి. మీ అందరికి సామూహికంగా 'యస్'-'నో'ల రూపంలో నిర్ణయాలు తీసుకోవడం ఒక అగ్ని పరీక్షలాంటిది. పృథ్వీ సదస్సుల్లో మరింత అక్కడచేరి, మీరు పనిచేసిన తీరును వృక్ష సముదాయం బాగా పరిశీలించాయి!

నేనూ నా పరిశోధన ఈ విషమ పరిస్థితుల్లో ఈ విధంగా తోడ్పడుతున్నందుకు నాకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషంగా ఉంది. నా పరిశోధనకు ఎప్పటికపుడు తగిన ప్రోత్సాహాన్ని, ఆర్థిక సహాయాన్ని ప్రాజెక్టుల రూపంలో అందిస్తున్న భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను."

డా॥ రజని రావిచెట్టు చెప్పిన సూత్రాలను ప్రకటించేందుకు గొంతు సవరించుకుంది.

అగ్ర నాయకులంతా ఉత్కంఠతో, వినడానికి ఆసక్తితో కుర్చీల్లో శరీరాల్ని కాస్త విదిలించి మళ్ళీ సర్దుకొని కూచున్నారు. ఎన్నో అంతర్జాతీయ సమస్యల్ని తమ తమ దౌత్య నిపుణతను ప్రదర్శించిన ఉద్దండులు తేలిక భావంతో తమలో తామే నవ్వుకున్నారు. చర్చల్ని పరిష్కరించకుండా ఎలా ఏళ్ళకొలది, దశాబ్దాలకొద్దీ కొనసాగించవచ్చో అక్కడ ఆసీనులైన వారందరికీ వెన్నతో పెట్టిన విద్య. చెట్లు సంధించబోయే చర్చాంశాల్ని ఎదుర్కోవడాన్ని ఎంతో సునాయాసంగా తీసుకుంటున్నారు. మరికొందరు తమ వాక్చాతుర్యాన్ని ప్రదర్శించేందుకు ఇది అద్భుతమైన అవకాశమని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని ప్రపంచమంతా లైవ్‌టెలికాస్ట్ చేస్తున్నారు. అన్ని దేశాల్లో ప్రజలు ఉత్కంఠతో టీవీలను తిలకిస్తున్నారు. తమ తమ నాయకుల్ని టీవీ తెరలపై చూస్తూ, వారు ఏరకమైన నిర్ణయాలు తీసుకుంటారో, అవి తమ భవిష్యత్తును ఎలా నిర్దేశిస్తాయో ?... కాసేపట్లో తెలిసిపోతుందని కళ్ళను, చెవుల్ని టీవీలను అతికించారు. అందరికీ సస్పెన్స్ .... టెన్షన్.... ఆవేదన ... బరువెక్కుతున్న గుండెలు.

సూత్రాల్ని చదివి డా॥ రజని "మీరు నాలుగయిదు గంటల్లో చర్చించి నాకు ఒక్కో సూత్రానికి 'యస్-నో'ల రూపంలో జవాబివ్వండి. జవాబులు ఖచ్చితమైన నిర్ణయాలుగా ఉండాలని, వివరణలు రూపంలో ఇస్తే ఒప్పుకోమని రావి చెట్టు ఖండితంగా చెప్పింది." అని ప్రకటించి కూచుంది డా॥ రజని.

సూత్రాల్ని విని సుమారుగా అందరు అగ్రనాయకులు తలలు దించుకున్నారు. సూత్రాలన్ని ప్రజలెన్నుకున్న నాయకుల అసమర్థతను, సంకుచితతత్వాన్ని, ఎవరికి వారే యమునా తీరే స్వభావాన్నీ, మానవతా దృక్పథం లేని అలౌకికాన్ని గట్టిగా వీపు చరిచి మరీ గుర్తుకు తెచ్చాయి. ధనిక దేశాల విలాస జీవిత పృథ్వి సుస్థిరతకు ఎలా గొడ్డలిపెట్టో సూటిగా తగిలింది. దేశాల మధ్యగల ఆర్థిక అసమానతల్ని ఎలా నిర్మూలించవచ్చో ఇకనైనా ఆలోచించమన్నాయి. హ్రస్వదృష్టిపూరిత ఆలోచనా విధానాలకు స్వస్తి చెప్ప మన్నాయి.ఇలా ఎన్నో ... ఎన్నెన్నో ప్రశ్నలు ఫౌంటేన్ నుండి చిమ్ముకునే ధారల్లా, బీజంలో మర్రి చెట్టుదాగి ఉన్నంత భావంతో ఒక్కో సూత్రం నుండి ఉద్భవించాయి. అగ్ర నాయకుల బుర్రలు వేడెక్కాయి. చర్చలకు తావులేని సూత్రాలవి ! అన్నిటికి జవాబు దేశాల సమైక్యత ... పృథ్విని కాపాడుకునే బాధ్యత. ఒక తల్లి తన శిశువును కాపాడుకునే త్యాగనిరతి. ప్రపంచ జనాభా ఒక్కుమ్మడిగా గట్టిగా అరచి నట్టయ్యింది.నాయకులందరూ జడుసు కున్నారు.

★ ★ ★

డా॥ రజని సంతోషంతో సమాచారాన్ని పంపేందుకు తన నాజూకు వేళ్ళను కంప్యూటర్‌కీబోర్డుపై టక టక లాడించింది.

రువాండా, సోమాలియా, బోస్నియా ... ఇంకా ఇతర దేశాల్లో అప్పుడే జన్మించిన శిశువుల ఏడ్పులు విని ఆహ్వానిస్తూ చెట్లు సంతోషంతో ఊగాయి.